# శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 205 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | మంగళవారం 10-03-2026 | పేజీలు : 2




## ఈసారైన న్యాయం జరుగుతుందా..?

### బడ్జెట్‌లో బీసీ వర్గాలకు కేటాయింపులు పెరిగేనా..!

- గత బడ్జెట్‌లన్నింటిలో బీసీలకు అన్యాయమే..!
- ఉత్సవ విగ్రహాలుగా బీసీ కుల కార్పొరేషన్లు..!
- అటకెక్కిన బీసీ సబ్ ప్లాన్..!
- దాని గురించి ఊసే ఎత్తని వైనం..!
- ఉద్యోగాలు లేక, స్వయం ఉపాధికి రుణాలు రాక బీసీ యువత విలవిల..!
- ఈసారి బడ్జెట్ కేటాయింపులపైనే గంపెడాశలు..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** బీసీలకు అనాదిగా అన్నింటా అన్యాయమే. సామాజిక, రాజకీయ, ఆర్థికంగా జమాన నుంచి తీవ్ర వివక్షకు గురవుతున్నారు. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత సబ్బండ బీసీ కులాలకు న్యాయం జరుగుతుందనుకేంటే గత పన్నెండ్ల రాష్ట్ర బడ్జెట్లలో వారికి జనాభా దామాషా ప్రకారం ఎక్కడా...సరైన కేటాయింపులే జరగకపోవడం దారుణం. కేసీఆర్ పదేళ్ల పరిపాలనలో బీసీ గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనైన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి బీసీ సబ్ ప్లాన్ పేరుతో బీసీలకు కాస్తా న్యాయం చేసే ప్రయత్నం చేశారు. మన రాష్ట్రం మనకు వచ్చిన తర్వాత బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు పెరుగుతాయను అత్యంత దారుణంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం,

తరువాయి 2లో...

# పైసలా..? పెంకాసులా..

## బీజేపీకి మస్తు ఆమ్దానీ

### అన్ని పార్టీలు ఒక ఎత్తయితే.. బీజేపీది మరో ఎత్తు

- విరాళాల వెనుక అసలు గుట్టు ఏంటి..?
- కాంగ్రెస్ ఆదాయం రూ.918 కోట్లే..
- ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస్ రూ.685 కోట్లతో దేశంలోనే టాప్

6 జాతీయ పార్టీల ఆదాయం(రూ.7960 కోట్లు..

అందులో బీజేపీ వాటా రూ.6768 కోట్లు ఇందులో కార్పొరేట్ విరాళాలే 90 శాతం

అసలు ఎవరిస్తుండ్రు.. ఎందుకిస్తుండ్రు..




**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** ప్రజాస్వామ్యమా..? కార్పొరేట్ రాజ్యమా..? బీజేపీ ఖజానాకు కుంభవృష్టిలా కురుస్తున్న కార్పొరేట్ విరాళాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఏ లాభం ఆశించకుండానే పారిశ్రామిక దిగ్గజాలు వందల కోట్లు బీజేపీకి ధారపోస్తున్నాయా? లేక ఈ కోట్ల వెనుక ఏదైనా 'క్విడ్ ప్రో కో' దాగి ఉందా? అన్న అనుమానాలు లేకపోలేదు. రాజకీయ పార్టీల నిధుల సేకరణలో బీజేపీ ఏకఛత్రాధిపత్యం వహించింది. ఆ పార్టీకి అందిన విరాళాల్లో 85 శాతం నిధులు ఆ ఒక్క పార్టీకే అందడం అంతు చిక్కని అంశంగా మారింది. బీజేపీకి కార్పొరేట్ కంపెనీలు ఈ స్థాయిలో ఉదారత చూపడం వెనుక ఉన్న మర్మమేమిటనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి పెట్టుబడులకు లాభాలు రావడం సహజం.. కానీ రాజకీయ విరాళాలకు కార్పొరేట్ కంపెనీలకు వచ్చే లాభాలేమిటి? బీజేపీ ఖాతాలో చేరిన రూ.6,769 కోట్లు ఇప్పుడు భారత రాజకీయాల్లో పెను సంచలన అంశంగా మారింది. సామాన్యుడికి అంతుచిక్కని ఈ నిధుల వెనుక కార్పొరేట్ కంపెనీల పెద్ద మనసు ఉందా? లేక ప్రభుత్వ విధానాల్లో తమ వాటా కోసం వేసిన పెద్ద స్కెచ్ ఉందా? అన్న విమర్శలు లేకపోలేదు. ఇటీవల అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తాజా నివేదిక రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో బీజేపీకి అందిన రూ.6,769.14 కోట్ల భారీ ఆదాయంలో సింహభాగం కార్పొరేట్ సంస్థల నుంచే రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఏ లాభం ఆశించకుండా కార్పొరేట్ కంపెనీలు వందల కోట్లు ఎందుకు

తరువాయి 2లో...

### యాసిడ్ దాడి బాధితులకు అండగా ఉండాలి

- వారికి ప్రభుత్వం సర్కార్ కొలువులు ఇవ్వాలి
- ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో భత్యమైన చెల్లించాలి
- అందుకు అనుగుణంగా చట్టాలు రూపొందించండి
- కేంద్రం, రాష్ట్రాలులకు సుప్రీం కీలక ఆదేశాలు

2





### సిలిండర్ల బ్లాక్ మార్కెట్‌పై కేంద్రం కీలక నిర్ణయం

- ఎల్‌పీజీ సిలిండర్ బుకింగ్ గడువు పెంపు
- సిలిండర్‌కు సిలిండర్‌కు ఇంతకు ముందున్న గడువు 21 రోజులే
- ఆ గడువును ఇక నుంచి 25 రోజులకు పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడి

2



### ఆశలు ఆవిరి

- స్టాక్ మార్కెట్ల భారీ పతనం
- రూ.8 లక్షల కోట్ల మదుపర్ల సంపద గోవిందా
- క్రూడాయిల్ ధరల పెరుగుదలే కారణం

2



### రైతు బంధు రాదు

- రాహుల్ బంధు కింద రూ. వెయ్యి కోట్లు పంపించాలని చూస్తున్నారు
- రేవంత్ ధ్యాసంతా హైకమాండ్ కు పైసలు పంపడంపైనే ఉంది
- అన్నదాతలకు రుణమాఫీ చేశామంటున్నారు
- ఎక్కడ చేశారో చెప్పాలి
- కాంగ్రెస్ పాలనపై రైతులకు క్లారిటీ వచ్చింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



### ట్రంప్‌ను చంపేందుకు ఇరాన్ కుట్ర

#### 2024లో రెండుసార్లు యత్నం

- స్పెషల్ టీమ్‌లు సైతం రంగంలోకి..
- అమెరికాకు చెందిన ఇద్దరు హంతకులకు సుపారీ ఇచ్చిన ఇరాన్ స్పై
- హంతకులు పోలీసులకు దొరికిపోయారు
- 2020లోనూ ట్రంప్‌ను 7 రోజుల్లోనే చంపేందుకు ఆదేశాలు
- వెల్లడించిన ప్రముఖ అమెరికా మీడియా సంస్థ

2

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను చంపేందుకు ఇరాన్ కుట్ర చేసిందని అమెరికాకు చెందిన ఓ ప్రముఖ మీడియా సంస్థ పేర్కొనడం సంచలనంగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌తో యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ మీడియా సంస్థ పేర్కొన్న ట్రంప్ హత్యకు కుట్ర సెగలు రేపుతోంది. ఆ ప్రముఖ మీడియా సంస్థ కథనం ప్రకారం.. ఇరాన్ 2024లో రెండు సార్లు ట్రంప్‌ను చంపడానికి కుట్ర చేసింది. ఇందుకోసం టీమ్‌లను సైతం రంగంలోకి దింపింది. 2024లో ట్రంప్ అధ్యక్ష పదవి పోటీలో ఉన్నారు. జోరుగా ప్రచారాలు నిర్వహిస్తూ ఉన్నారు. ఆ సమయంలో అమెరికాలోని ఓ ఇరాన్ స్పై ట్రంప్‌ను చంపడానికి అమెరికాకు చెందిన ఇద్దరు హంతకులకు సుపారీ ఇచ్చాడు. వీరిద్దరూ పోలీసులకు దొరికిపోయారు.



### లొంగే ప్రసక్తే లేదు..!

- మరో ఏనిమిదేళ్ళయినా యుద్ధం కొనసాగిస్తాం
- అమెరికా ఇజ్రాయిల్ పై దాడులు చేస్తాం స్పష్టం చేసిన ఇరాన్
- ఇరాన్ కు పూర్తిగా అండగా ఉంటాం, మద్దతు ప్రకటించిన రష్యా అధ్యక్షుడు పుతిన్
- ఇరాన్ నేతల మృతికి సంతాపం

2

### సీఎం రేవంత్ రెడ్డి

## పూటకో మాట మారుస్తుండు..!

### ఫీజు రీయంబర్మెంట్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి

- విద్యార్థులకు ఉచిత ఈవీ స్కూటర్లు ఇస్తామని హామీలిస్తుండు
- పెన్షన్లు ఇచ్చేందుకు పైసల్ లైవ్ అని మాటలు చెబుతూ..
- మూసి ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిండు
- ఫేక్ హామీలతో ప్రజలను మోసం చేస్తుండు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కామెంట్స్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి పూటకో మాట మారుస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెడుతుతన్నాడని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. సోమవారం సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు అసలు పొంతన లేదని.. రాష్ట్రంలో పెండింగ్ సమస్యలను పక్కన పెట్టి, కొత్త హామీలతో ప్రజలను

తరువాయి 2లో...



### ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఎస్సైలు..!

- అరెస్ట్ చేయకుండా ఉండేందుకు నిదితుడు నుంచి రూ.లక్ష డిమాండ్
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- నగదు సీజ్ చేసి, పట్టుబడిన వారిని నాంపల్లి కోర్టులో హాజరు పరిచిన అధికారులు
- ఎల్బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఘటన




2

శనార్తి తెలంగాణ

మంగళవారం 10-03-2026




# పైసలా.. పెంకాసులా..?




**మొదటిపేజీ తరువాయి...**

కుమ్మరిస్తున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీకి వచ్చిన మొత్తం ఆదాయంలో దాదాపు 90.48 శాతం(రూ.6,124.85 కోట్లు) కేవలం విరాళాల ద్వారానే లభించింది. ఇందులో అత్యధిక భాగం ఎలక్టోరల్ ట్రస్ట్‌ల ద్వారా అందిన కార్పొరేట్ నిధులే కావడం కొసమెరుపు.

**బీజేపీకి దరిదాపుల్లో లేని పార్టీలు..**

దేశంలోని ఆరు జాతీయ పార్టీల (బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, ఆప్, బీఎస్పీ, ఎన్‌పీఈపీ)కు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.7,960.09 కోట్ల ఆదాయం విరాళాల రూపంలో సమకూరింది. అయితే ఇందులో ఒక్క బీజేపీ వాటానే 85.03 శాతం(రూ6,769.14 కోట్లు) కావడం గమనార్హం. గతేడాదితో (2023-24) పోలిస్తే బీజేపీ ఆదాయం 55.95శాతం పెరిగింది. ఇక కాంగ్రెస్ పరిస్థితికి వస్తే.. రూ.918.28 కోట్లు(11.53% వాటా) ఆదాయం రాగా, గతేడాదితో పోలిస్తే కాంగ్రెస్ ఆదాయం 25.05 శాతం తగ్గడం గమనార్హం. అయితే పార్టీలకు వచ్చిన ఆదాయంలో సింహభాగం విరాళాల నుంచే అందింది. ఎలక్టోరల్ ట్రస్ట్‌ల ద్వారా వచ్చిన నిధుల్లో బీజేపీకి అత్యధికంగా 82 శాతం లభించాయి. బీజేపీకి వచ్చిన ఆదాయంలో సుమారు 90.48 శాతం (రూ.6,124.85 కోట్లు) కేవలం విరాళాల ద్వారానే రావడం కొసమెరుపు. కాంగ్రెస్ తన ఆదాయంలో 38.12శాతం (రూ.350.12 కోట్లు) సభ్యత్వాల ద్వారా సేకరించింది. ఆశ్చర్యకరంగా మాయావతి నేతృత్వంలోని బీఎస్పీకి ఒక్క రూపాయి కూడా విరాళం రాలేదని, తన మొత్తం ఆదాయం (రూ.58.58 కోట్లు) ఇతర మార్గాల ద్వారా వచ్చిందని ప్రకటించింది. ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ, ఖర్చుల విషయంలో కూడా పార్టీలు భారీగానే వెచ్చించాయి. బీజేపీ తన ఆదాయంలో 55.76 శాతం (రూ.3,774.58 కోట్లు) ఖర్చు చేయగా, ఇందులో ఎక్కువ భాగం ఎన్నికల ప్రచారం, అడ్మినిస్ట్రేటివ్ పనులకు కేటాయించినట్టు చెబుతోంది. కాంగ్రెస్ మాత్రం తన ఆదాయం కంటే ఎక్కువగా ఖర్చు పెట్టింది. ఆదాయం రూ.918.28 కోట్లు రాగా, ఖర్చు రూ.1,111.94 కోట్లు (అంటే ఆదాయం కంటే 21 శాతం ఎక్కువ) ఖర్చు చేయడం గమనార్హం. సీపీఎం సైతం తన ఆదాయం రూ.172.60 కోట్ల కంటే కొంచెం ఎక్కువగా రూ.173.86 కోట్లు) ఖర్చు చేసింది.

**ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస టాప్..**

తెలంగాణ రాజకీయాల్లో దశాబ్ద కాలం పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన బీఆర్ఎస్‌కు ప్రస్తుతం రాజకీయంగానే కాదు.. ఆర్థికంగానూ గడ్డుకాలం నడుస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పార్టీ ఆదాయం గణనీయంగా తగ్గినప్పటికీ దేశంలోని అగ్రశ్రేణి కార్పొరేట్ ట్రస్ట్‌ల నుంచి నిధులు అందుకుంటున్న అతికొద్ది ప్రాంతీయ పార్టీలలో ఒకటిగా బీఆర్ఎస్ నిలవడం చర్చనీయాంశంగా మారింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.685.51 కోట్లతో దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీల కంటే అత్యధిక ఆదాయం కలిగిన పార్టీగా బీఆర్ఎస్ రికార్డు సృష్టించింది. అయితే 2024-25 నాటికి ఆ ఆదాయ ప్రవాహం కొంత మందగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీకి దాదాపు రూ.15.09 కోట్లు విరాళాలు అందగా, అందులో ట్రస్ట్‌ల ద్వారానే పార్టీకి అత్యధికంగా నిధులు అందాయి. 2023 చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికల తర్వాత పార్టీకి వచ్చే నేరుగా విరాళాలు తగ్గుముఖం పట్టాయి. సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేయడంతో గతంలో బాండ్ల ద్వారా వందల కోట్లు పొందిన ఈ పార్టీకి ఇప్పుడు నిధుల సేకరణ సవాల్‌గా మారింది. అయితే ఆదాయం తగ్గినప్పటికీ దేశంలోని రెండు అతిపెద్ద ఎలక్టోరల్ ట్రస్ట్‌ల నుంచి బీఆర్ఎస్ విరాళాలు పొందడం గమనార్హం. టాటా గ్రూప్ వంటి దిగ్గజ కంపెనీలు నిధులు ఇచ్చే ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి బీఆర్ఎస్ దాదాపుగా రూ.10 కోట్లు విరాళం పొందింది. మేఘా ఇంజనీరింగ్, భారతీ ఎయిర్‌టెల్ వంటి సంస్థలు దాతలుగా ఉన్న ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి సైతం రూ.5 కోట్లు పార్టీ ఖాతాలో చేరాయి. ఎలక్టోరల్ బాండ్లు పోయి ట్రస్ట్‌ల ద్వారా నిధులు వస్తున్నా.. ఆ నిధులు ఏ ప్రాతిపదికన బీఆర్ఎస్ పార్టీకి కేటాయిస్తున్నారనేది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలింది.

**విరాళాల వెనుక కాంట్రాక్ట్ కేటాయింపులు..**

వాస్తవానికి బీజేపీకి విరాళాల వెనుక కార్పొరేట్ కంపెనీల పెద్ద స్కెచ్ ఉందనే ఆరోపణలు లేకపోలేదు. అయితే ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ సంస్థ నుంచే బీజేపీకి భారీగా నిధులు అందాయి. ఈ ట్రస్ట్‌లో దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక వేత్తలు సభ్యులుగా ఉండటం గమనార్హం. ఎలక్టోరల్ బాండ్ల వ్యవస్థను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ కార్పొరేట్ సంస్థలు నేరుగా లేదా ట్రస్ట్‌ల ద్వారా తమ నిధులను అధికార పార్టీకి తరలించడం ఆగలేదు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఖర్చు చేయని కంపెనీలు సైతం రాజకీయ విరాళాల విషయంలో ఎందుకు ఇంత ఉదారంగా ఉంటున్నాయనేది అంతుచిక్కని రహస్యంగా మారింది. మరోవైపు అధికార పార్టీకి కార్పొరేట్ శక్తులు భారీగా నిధులు ఇవ్వడం వల్ల, నిధుల కొరతతో ఉన్న ఇతర పార్టీలు ఎన్నికల బరిలో వెనకబడిపోతున్నాయి. ఇది ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీస్తుందనే వాదన లేకపోలేదు. భారీగా విరాళాలు ఇచ్చే సంస్థల ప్రయోజనాల కోసమే ప్రభుత్వ నిర్ణయాలు ఉండే అవకాశం ఉందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నిధుల సేకరణలో పారదర్శకత లేకపోవడం.. కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం పెరగడం భవిష్యత్తులో భారత రాజకీయ ముఖచిత్రాన్ని ఏ దిశగా మారుస్తుందో అన్నది చర్చనీయాంశం అవుతోంది. అయితే రాజకీయ పార్టీలకు అందిన భారీ విరాళాలపై విచారణ జరగాలని, రాజకీయ నిధులకు ఒక గరిష్ట పరిమితి ఉండాలనే డిమాండ్ విన్పిస్తోంది.

## ...కేంద్రం కీలక నిర్ణయం

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** సిలిండర్ల బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌పీజీ సిలిండర్ బుకింగ్‌కు సంబంధించిన గడువును పెంచుతూ సోమవారం కొత్త మార్పులు ప్రకటించింది. ఇప్పటివరకు ఒక సిలిండర్ బుక్ చేసిన తర్వాత మరో సిలిండర్ బుక్ చేయడానికి 21 రోజుల గడువు ఉండేది. అయితే అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించడానికి ఆ గడువును ఇకపై 25 రోజులకు పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ నిర్ణయం ద్వారా సిలిండర్ల సరఫరా వ్యవస్థను మరింత క్రమబద్ధీకరించాలనే ఈ డిసిషన్ తీసుకున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. దేశంలో ఎల్‌పీజీ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కొందరు తరచుగా సిలిండర్లు బుక్ చేసి నిల్వ చేసుకుని బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల మధ్య సమానంగా సిలిండర్లు అందేలా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొత్త నిబంధనలతో బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట పడటంతో పాటు అవసరమైన వారికి సమయానికి సిలిండర్లు అందే అవకాశం ఉంటుందని కేంద్రం భావిస్తోంది.

## యాసిడ్ దాడి బాధితులకు అండగా ఉండాలి

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** యాసిడ్ దాడి బాధితుల పునరావాసానికి ప్రభుత్వం మరింత బాధ్యత తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బాధితులకు అండగా నిలుస్తూ వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేలా ప్రత్యేక చట్టాలను రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితులు తీవ్ర శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంది. యాసిడ్ దాడికి గురైన బాధితుల రక్షణపై దాఖలైన పిటిషన్‌ను సోమవారం విచారించిన సుప్రీంకోర్టు ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. యాసిడ్ దాడికి గురైన బాధితులకు వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా చూడాలని తెలిపింది. ఒకవేళ వారికి ఉద్యోగాలు కల్పించలేని పక్షంలో బాధితులకు కనీసం భత్యమైన చెల్లించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను రూపొందించాలని తెలిపింది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా తీసుకొని బాధితులకు ఆర్థిక భరోసా అందేలా చూడాలని స్పష్టం చేసింది.

## సీఎం రేవంత్ రెడ్డి పూటకో మాట మారుస్తుండు..!

**మొదటిపేజీ తరువాయి...**

మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టి.. ఇప్పుడు అమ్మాయిలకు ఉచితంగా ఈవీ (EV) స్కూటీలు ఇస్తామంటూ కొత్త నాటకాలకు సీఎం రేవంత్ రెడ్డి తెరలేపారని విమర్శించారు. పెన్షన్లు క్లియర్ చేయడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. ఓవైసీ ఒక్క పిలుపు ఇవ్వగానే మూసీ ప్రాజెక్ట్ కోసం వేల కోట్ల రూపాయలను ఎలా సమీకరిస్తోందని నిలదీశారు. ఒకవైపు పేదలు, దళితులు, గిరిజనులకు ఇచ్చేందుకు భూమి లేదని చెబుతూనే.. మరోవైపు జర్నలిస్టులకు, మూసీ పరివాహక ప్రాంతాల వారికి భూమి ఇస్తామని హామీలు ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. అలాగే, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. బండి సంజయ్ ఒక సెటైరికల్ కామెంట్ చేశారు. రాష్ట్రంలో దోమల సమస్య పెరిగిందన్న సీఎం మాట నిజమేనని, ప్రజలు తమ పని తాము చేసుకుంటున్నా.. కాంగ్రెస్ పార్టీ దోమల మాదిరిగానే వచ్చి ప్రజలను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అవినీతి, వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఇప్పటికైనా, ప్రభుత్వ ధోరణి మారాలని, ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## భారీగా గంజాయి పట్టివేత

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** ఇటీవల కాలంలో ప్రమాదకరమైన మత్తు పదార్థాలు తరచూ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. వీటిని నిర్మూలించేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ.. ఎక్కడో ఒక చోట వీటి విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా, సోమవారం హైదరాబాద్ లోని శంషాబాద్ విమానాశ్రయంలో కౌలాలంపూర్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద రూ.3 కోట్ల విలువైన 9 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ముషీరాబాద్‌లో హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. జె.ఆర్.ప్రదీప్ నుంచి విజయ్ కుమార్ హాష్ ఆయిల్ కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించి, 367 గ్రాముల హాష్ ఆయిల్, ఒక బైక్, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి ప్రమాదకరమైన మత్తు పదార్థాలను ఎవరైనా విక్రయించినా.. లేదా వినియోగించినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.



# ఈసారైన న్యాయం జరుగుతుందా..?

**మొదటిపేజీ తరువాయి...**


ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ నిధుల మొత్తాన్ని తగ్గించేయడం శోచనీయం. రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతం. కానీ, బీసీలకు వారి పాపులేషన్ ప్రకారం ఏనాడు ప్రభుత్వాలు నిధులను కేటాయించలేదు. బీసీల జనాభా 56 శాతం పైనే ఉంటే..బడ్జెట్‌లో మాత్రం 10 శాతంలోపే కేటాయింపులు చేయడం గమనార్హం.

కేసీఆర్ హయాంలోనైతే బీసీ సబ్ ప్లాన్‌ను అస్సలు పట్టించుకోకపోవడం బాధాకరం. కేసీఆర్ పదేళ్ల పాలనంతా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం వీటి చుట్టే తిరిగింది. కానీ, బీసీ వర్గాలకు మాత్రం వారి స్వయం ఉపాధి కోసం పెద్దగా నిధులు కేటాయించేందుకు ఇష్టపడలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగాలకు వచ్చిన నోటిఫికేషన్లు అంతంతే. ఈ నేపథ్యంలోనే కనీసం స్వయం ఉపాధి కోసమైన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందకుంటే అది లేకపోవడంతో బీసీ సామాజిక వర్గాల్లో తీవ్రమైన ఆర్థిక అసమానతలు ఏర్పడ్డాయి. ఇక తెలంగాణలో కాంగ్రెస్ కొలువుదీరిన తర్వాత పరిస్థితులు మరింతగా దిగజారిపోయారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీ నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు పదో పరకో స్వయం ఉపాధి కోసం రుణాలను మంజూరు చేస్తే కాంగ్రెస్ సర్కార్ ఆ మేరకు కూడా లోన్స్ ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో తెలంగాణ వచ్చినప్పటికీ అటు బీసీలకు ప్రభుత్వ ఉద్యోగాలు రాక..ఇటు స్వయం ఉపాధి కోసం బడ్జెట్‌లో పెద్ద నిధులు లేక సబ్బండ బీసీ కులాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇక ఈనెల 16 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే బీసీ సబ్ ప్లాన్, కుల కార్పొరేషన్ల గురించి పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ప్రభుత్వం నిర్వహించిన సామాజిక-ఆర్థిక సర్వే ప్రకారమే తెలంగాణలో బీసీల జనాభా 56.33 శాతంగా ఉంది. రాష్ట్రంలో అత్యధిక జనాభా బీసీలదే అయినప్పటికీ గత పన్నెండేళ్లుగా బీసీ వర్గాలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు జరగలేదు. గత అన్ని బడ్జెట్లలో రూ.6 వేల కోట్లకు మించి కేటాయింపులు జరగలేదు. గౌడ్, యాదవ, ముదిరాజ్, మత్స్యకార, వడ్డెర, నాయీబ్రాహ్మణ, రజక, కురుమ ఇలా ఏ కుల కార్పొరేషన్‌కు ప్రభుత్వాలు నిధులు ఇవ్వలేదు. దీంతో ఆ లోటును ఈసారైన రేవంత్ రెడ్డి పూడ్చుతాడా..? లేదా..? అనే డిస్కషన్ జరుగుతోంది. ఇప్పటికే బీసీలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈసారి బడ్జెట్‌లో బీసీలకు అంత ప్రాధాన్యం దక్కుతుందన్న నమ్మకం ఆ వర్గాల్లో లేకుండా పోయింది.

# చిన్నగూడూరు ఎస్ఐ వసూళ్ల పర్వం

- ఇసుక ర్యాంప్ నిర్వాహకుడుకి బెదిరింపులు
- ర్యాంప్ నిర్వాహణకు రూ.3 లక్షల డిమాండ్
- రూ.లక్షన్నర ముట్టజెప్పిన నిర్వాహకుడు, మరో లక్ష కోసం పట్టు
- మాట విననందుకు బాలకృష్ణ బైండోవర్
- ఎస్ఐ ప్రవీణ్ టార్చర్ తట్టుకోలేక ఆయన అసలు లంచాల వ్యవహారాన్ని బయట పెట్టిన బాలకృష్ణ




**శనార్తి తెలంగాణ, వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లా చిన్నగూడూరు ఎస్ఐ ప్రవీణ్ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇసుక ర్యాంపులను ఆయన టార్గెట్ చేసిన తీరుపై పలువురు మండిపడుతున్నారు. మర్రిచెట్టు ఇసుక ర్యాంప్ వ్యవహారంలో ఆయన వ్యవహరించిన విధానం వివాదానికి కారణమైంది. ర్యాంప్ నిర్వహకుడు బాలకృష్ణపై ఎస్ఐ ప్రవీణ్ డబ్బులు కోసం వేధించడం చర్చనీయాంశమైంది. ఎస్ఐ వ్యవహార శైలిని తట్టుకోలేని బాలకృష్ణ ప్రవీణ్ వేధింపులపై మీడియాకెక్కారు. ఎస్ఐ ప్రవీణ్ తనను ర్యాంపు నిర్వాహణ కోసం రూ.3 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎస్ఐ ప్రవీణ్‌కు తాను రూ.1.50 లక్షలు ఇచ్చుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ అంతటితో ఆగకుండా తనకు మరో రూ.లక్ష కావాలని వేధింపులకు దిగినట్లు బాలకృష్ణ మీడియా ముందు మొరపెట్టుకున్నారు. ఆయన హారాస్‌మెంట్‌ను భరించలేక తాను రూ.20,000 ఎస్ఐ ప్రవీణ్‌కు ఫోన్‌పే చేసినట్లు తెలిపారు. వ్యవహారం బయటకు పొక్కడంతో...తనను మరింత వేధింపులకు గురి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తనను అనవసరంగా బైండోవర్ చేసినట్లు చెప్పారు. తనను స్టేషన్‌కు పిలిపించుకొని ఇబ్బందులకు గురి చేప్పారు. అందువల్ల ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సమగ్రమైన దర్యాప్తు చేసి ఎస్ఐ ప్రవీణ్‌పై తగు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

# ట్రంప్‌ను చంపేందుకు ఇరాన్ కుట్ర

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను చంపేందుకు ఇరాన్ కుట్ర చేసిందని అమెరికాకు చెందిన ఓ ప్రముఖ మీడియా సంస్థ పేర్కొనడం సంచలనంగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌తో యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ మీడియా సంస్థ పేర్కొన్న ట్రంప్ హత్యకు కుట్ర సెగలు రేపుతోంది. ఆ ప్రముఖ మీడియా సంస్థ కథనం ప్రకారం.. ఇరాన్ 2024లో రెండు సార్లు ట్రంప్‌ను చంపడానికి కుట్ర చేసింది. ఇందుకోసం టీమ్‌లను సైతం రంగంలోకి దింపింది. 2024లో ట్రంప్ అధ్యక్ష పదవి పోటీలో ఉన్నారు. జోరుగా ప్రచారాలు నిర్వహిస్తూ ఉన్నారు. ఆ సమయంలో అమెరికాలోని ఓ ఇరాన్ స్పై ట్రంప్‌ను చంపడానికి అమెరికాకు చెందిన ఇద్దరు హంతకులకు సుపారీ ఇచ్చాడు. వీరిద్దరూ పోలీసులకు దొరికిపోయారు. వీరిలో ఒకరిని పాకిస్థాన్‌కు చెందిన ఆసిఫ్ రజా మర్చంట్‌గా గుర్తించారు. మరోవైపు 2020లో అమెరికా చేసిన దాడుల్లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఖాసీమ్ సోలెమని చనిపోయాడు. దీనికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఇరాన్ ట్రంప్‌ను చంపడానికి పూనుకుంది. మరో ప్లాన్‌లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్.. ఫర్హద్ షకేరీ అనే వ్యక్తిని ట్రంప్‌ను చంపడానికి పురమాయించింది. ఏడు రోజుల్లోనే ట్రంప్‌ను చంపాలని అతడికి ఆదేశాలు జారీ చేసింది. ఒక వేళ ట్రంప్‌ను చంపలేకపోతే.. ప్లాన్‌ను ఎన్నికలు అయిపోయే వరకు వాయిదా వేస్తామని చెప్పింది. ట్రంప్ ఆ ఎన్నికల్లో ఓడిపోతే చంపడం సులభం అవుతుందని ఇరాన్ భావించింది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ఆదేశాల మేరకు షకేరీ న్యూయార్క్‌కు చెందిన కార్లీస్లే రివెరా, జోనాదన్ లోడ్‌హోల్ట్‌లకు సుపారీ ఇచ్చాడు. ట్రంప్‌ను చంపడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. దాడి జరగక ముందే పోలీసులు షకేరీని అరెస్ట్ చేశారు. ఇలా రెండు సార్లు ఇరాన్ చేసిన ప్రయత్నాలు ఫెయిల్ అయ్యాయని సదరు మీడియా సంస్థ చెప్పుకొచ్చింది.

# దిగొస్తున్న పసిడి..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** కొండెక్కిన పసిడి దిగుతోంది. వారం రోజుల క్రితం పెరుగుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు నాలుగు రోజుల నుంచి తగ్గుతూ వస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల మార్పులు, దిగుమతి సుంకాలు, పన్నులు, అలాగే రూపాయి, డాలర్ విలువలు దేశీయ మార్కెట్‌పై గణనీయమైన ప్రభావం చూపిస్తాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం రేట్లు తగ్గడం. లేకపోతే డాలర్ విలువ పడిపోయే పరిస్థితుల్లో దేశీయ మార్కెట్‌లోనూ తగ్గుతాయి. అలాగే, ఇటీవల వరుసగా పెరిగిన బంగారం ధరల కారణంగా పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున బంగారం కొన్నారు. అదే సమయంలో కొంతమంది పెట్టుబడిదారులు లాభాలను పొందేందుకు తమ వద్ద ఉన్న బంగారాన్ని అమ్మడం ప్రారంభించారు. దీంతో మార్కెట్‌లో సరఫరా పెరిగి ధరలు క్రమంగా తగ్గుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరపై సుమారు రూ.1950 వరకు తగ్గి సుమారు రూ.1,61,680 వద్ద కొనసాగుతోంది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర దాదాపు రూ.1800 వరకు తగ్గి రూ.1,42,800 లకు చేరింది. ఇక వెండి ధరల విషయానికి వస్తే కిలో వెండి ధరపై దాదాపు రూ.5000 వరకు తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూ.2,80,000 వద్ద కొనసాగుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ఆయా ప్రాంత పరిస్థితులను బట్టి బంగారం, వెండి ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

# రైతు బంధు రాదు

**శనార్తి తెలంగాణ, కరీంనగర్:** తెలంగాణలో అష్టదరిద్రపు పాలన ఉందని, అన్నదాతలను రేవంత్ సర్కార్ గోస పుచ్చుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసన సభ్యులు కేటీరామారావు విమర్శించారు. రాజన్న-సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఇటీవల తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన గీత కార్మికుడు సాయిలి కిషన్ గౌడ్ కుటుంబాన్ని కేటీఆర్ సోమవారం పరామర్శించారు. ఈ సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కేటీఆర్ కిషన్ గౌడ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో అధ్వాన పాలన సాగుతోందన్నారు. రేవంత్ పరిపాలనలో రైతులకు పెద్ద ఒరిగిందేమీ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులకు రైతు బంధు ఇవ్వడం చేతకావడం లేదు. కానీ, రాహుల్ గాంధీకి మాత్రం రూ.వెయ్యి కోట్లు పంపించాలని చూస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ధ్యాస అన్నదాతలపై లేదని, ఆయన ధ్యాసంతా హైకమండ్‌కు డబ్బులు పంపించే అంశంపైనే దాగి ఉందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రైతులకు రుణమాఫీ చేసినట్లు సీఎం చెబుతున్నారని, అసలు రాష్ట్రంలో సంపూర్ణంగా క్రాప్ లోన్స్ ఏ జిల్లాలో అమలు చేశారో సమాధానం చెబితే బాగుంటుందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్నదాతలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేవాళ్లమని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులున్నాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఎన్నో హామీలిచ్చిందన్న కేటీరామారావు, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఏ ఒక్కటి సరిగా నేరవేర్చలేకపోయారన్నారు. సన్నాలకు బోనస్ ఇస్తామని రేవంత్ రెడ్డి ముచ్చట్లు చెప్పారని, కానీ, అవన్నీ బోగస్ ముచ్చట్లేనని తేలిపోయిందన్నారు. కేసీఆర్ సర్కార్‌లో పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యేవని, కాంగ్రెస్ సర్కార్‌లో అలాంటి పరిస్థితులు లేవన్నారు. ఐకేపీ సెంటర్లు, కో-ఆపరేటివ్ పాయింట్ల వద్ద అమ్ముకున్న ధాన్యం పైసలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితులున్నాయన్నారు. తెలంగాణ ప్రజలకు ఇప్పటికే కాంగ్రెస్ పాలనపై ఓ అవగాహన వచ్చిందని, అందువల్ల రాబోయే రోజుల్లో ఆపార్టీకి గట్టి గుణ పాఠం ఖాయమన్నారు.

## ఆశలు ఆవిరి

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** ఆశలు ఆవిరయ్యాయి. స్టాక్ మార్కెట్లు మరోసారి కుప్పకూలాయి. ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరగడం దేశీయ షేర్ మార్కెట్లపై సోమవారం తీవ్ర ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలోనే భారతీయ స్టాక్ మార్కెట్లు నిన్న భారీ పతనాన్ని చవిచూశాయి. దాదాపు రూ.8 కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. ప్రారంభ ట్రేడింగ్‌లోనే సెన్సెక్స్ సుమారు 2,345 పాయింట్లు పడిపోయి 76,573 స్థాయికి చేరుకోగా, నిఫ్టీ 708 పాయింట్లు తగ్గి 23,741 వద్ద ట్రేడైంది. సెన్సెక్స్‌లోని దాదాపు 30 కంపెనీల షేర్లు నష్టాల్లోనే కొనసాగాయి. ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ షేర్ దాదాపు 8% పడిపోగా, టాటా స్టీల్, మారుతి, ఎస్‌బీఐ, ఆసియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి షేర్లు కూడా గణనీయంగా క్షీణించాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా 23% పెరిగి బ్యారెల్‌కు 114 డాలర్లకు చేరుకోవడం మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. విదేశీ పెట్టుబడిదారులు భారీగా షేర్లు విక్రయించడం కూడా పెట్టుబడిదారుల్లో ఆందోళన పెంచింది. ఆసియా మార్కెట్లు కూడా ఇదే ధోరణిలో పతనమయ్యాయి. దక్షిణ కొరియా కోస్పీ 7%కు పైగా, జపాన్ నిక్కీ 6.5% పడిపోయాయి. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు కొనసాగితే, క్రూడ్ ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో మార్కెట్లలో అనిశ్చితి కొనసాగవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఎస్సైలు..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అవినీతి తిమింగలాలు ఏసీబీ వలకు చిక్కాయి. ఒక సైబర్ క్రైమ్ కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. లక్ష లంచం తీసుకుంటూ ఎస్సై ప్రమోద్ గౌడ్, ఆర్ఎస్సై జతావత్ బాబు నాయక్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక సైబర్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేయకుండా, కేవలం బీఎన్ఎస్ఎస్ 35 (గతంలో 41ఏ సీఆర్‌పీసీ) కింద నోటీసులు ఇచ్చి వదిలేయడానికి ఈ ఇద్దరు అధికారులు లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ఇద్దరు ఎస్సైలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీ నగర్ చౌరస్తా సమీపంలో డబ్బులు ఇచ్చేందుకు బాధితులు అంగీకరించారు. ఆర్ఎస్సై నాయక్ అక్కడికి చేరుకుని లంచం తీసుకుంటుండగా, అప్పటికే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. ఎస్సై ప్రమోద్ గౌడ్ ప్రోద్బలంతోనే ఈ లంచం తీసుకున్నట్లు నిర్ధారించిన అధికారులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. వారిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు వెల్లడించారు. అలాగే, బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా విధుల ఉల్లంఘలకు పాల్పడి లంచం డిమాండ్ చేస్తే.. 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. 9440446106 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.



## ...ప్రసక్తే లేదు..!

**శనార్తి తెలంగాణ, ఢిల్లీ :** ఇరాన్, ఇజ్రాయిల్ - అమెరికా మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. ఈ యుద్ధం కారణంగా ఇరాన్ లో 1000 కి పైగా జనం మరణించారు. అయినా సరే.. పారిపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ అంశంపై భారత్‌లోని ఇరాన్ అత్యున్నత నాయకుడి ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకునే ప్రసక్తే లేదని అన్నారు. అవసరమైతే మరో ఎనిమిదేళ్ల సుదీర్ఘ యుద్ధం చేయడానికి కూడా తమ దేశం సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే, ఇరాన్ అణుబాంబు తయారు చేస్తోందన్న ప్రచారాన్ని ఆయన ఖండిస్తూ, అణు ఆయుధాల తయారీ ఇస్లాం ధర్మానికి విరుద్ధమని , తమ నాయకత్వం కూడా దీనిని ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తుచేశారు.సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా, ఆయన సామాన్య ప్రజలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు నిరాకరించారని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉంటే.. యుద్ధం తీవ్రరూపం దాల్చిన క్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్‌కు తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఇజ్రాయెల్, అమెరికాలతో సాగుతున్న ఘర్షణల్లో మిత్రదేశమైన ఇరాన్‌కు మాస్కో అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజ్తబా ఖమేనీకి పుతిన్ అభినందనలు తెలుపుతూ, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపించగలరని కోరారు. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ సహా ఇతర అగ్రనేతల మృతిపై ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రష్యా మద్దతుతో ఇరాన్ మరింత బలపడనుంది.